సాక్షి
నాగర్‌కర్నూల్
బుధవారం । 12 । జూన్‌ । 2024



గోల్‌మాల్‌..!

గద్వాలలో పౌరసరఫరాల శాఖ అవినీతి అధికారులకు అడ్డాగా మారింది.

వివరాలు 10లో ▸



జూరాలకు ఇన్‌ఫ్లో..

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 7,211 క్యూసెక్కులకు పెరిగింది.

వివరాలు 12లో ▸

గరిష్టం/కనిష్టం
29.4 /23.1

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళలో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

దరఖాస్తు చేసుకోండి

కొల్లాపూర్‌: పీజీలో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కొల్లాపూర్‌ ప్రభుత్వ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌ మార్క్‌పోలోనియస్‌ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎంట్రెన్స్‌ టెస్టులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పీజీలో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన వారితో పాటు డిగ్రీ ఫైనల్‌ ఇయర్‌ పరీక్షలు రాసిన వారు అర్హులని.. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 17వ తేదీలోగా టీఎస్‌సీపీజీఈటీ–2024 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు

- లైసెన్స్‌ లేని హోటళ్ల నిర్వాహకులకు నోటీసులు



అచ్చంపేట రూరల్‌: పట్టణంలోని పలు హోటళ్లలో మంగళవారం ఫుడ్‌ సేఫ్టీ ఆఫీసర్‌ మనోజ్‌ కుమార్‌ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అమృతపాణి మండి రెస్టారెంట్‌, పరివార్‌, నేషనల్‌, బటర్‌ఫ్లై హోటళ్లలోని ఆహార పదార్థాలు, చికెన్‌, మటన్‌, చేపలు, అల్లంవెల్లుల్లి పేస్టు ఇతర పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫ్రిజ్‌లో నిల్వ ఉన్న మాంసంపై ఎరుపు రంగులను పరిశీలించి, నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపే హోటళ్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిశుభ్రతతో పాటు ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. తాజా మాంసం, కూరగాయలు, ఐఎస్‌ఐ మార్కు కలిగిన సరుకులు మాత్రమే వంటలో ఉపయోగించాలని సూచించారు. పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పలు హోటళ్ల నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. నాలుగు హోటళ్లలో సేకరించిన ఆహార శాంపిళ్లను ల్యాబ్‌కు పంపిస్తామని.. రిపోర్టుల ఆధారంగా నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని ఫుడ్‌ సేఫ్టీ ఆఫీసర్‌ తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

ఉప్పునుంతల: వైద్యసిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తారాసింగ్‌ అన్నారు. ఉప్పునుంతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించడంతో పాటు రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలని.. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట వైద్యాధికారి రమాకాంత్‌, ఫార్మసిస్టు శ్రీనివాసులు ఉన్నారు.

14న ఐటీఐ జాబ్‌మేళా

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లాకేంద్రంలోని ఐటీఐ కళాశాలలో ఈనెల 14న జాబ్‌ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ శాంతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ట్రేడ్‌లలో ఉత్తీర్ణత సాధించిన వారు ఉదయం 10.30గంటలకు మేళాకు హాజరుకావాలని, బయోడేటా, ఆధార్‌, ఫొటోలు, స్టడీ సర్టిఫికెట్లు, బ్యాంక్‌ అకౌంట్‌ వివరాలతో రావాలని సూచించారు.

బడికి పోదాం.. చలో చలో

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

- విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనలో అధికారుల నిమగ్నం
- 415 బడుల్లో పూర్తికాని మరమ్మతు పనులు
- పూర్తిస్థాయిలో చేరని పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌



నాగర్‌కర్నూల్‌: వేసవి సెలవులు ముగియడంతో బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. పండగ వాతావరణంలో ప్రభుత్వ బడులను ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో నిమగ్నమయ్యారు. మంగళవారం శానిటేషన్‌ పనులు చేపట్టారు. విద్యార్థులకు కావాల్సిన పాఠ్యపుస్తకాలు, నోట్‌ బుక్కులు ఇప్పటికే జిల్లాకు చేరగా.. డీఈఓ పర్యవేక్షణలో వాటిని ఆయా మండలాలకు చేరవేశారు. అక్కడి నుంచి పాఠశాలల ఉపాధ్యాయులకు పంపిణీ చేస్తున్నారు. విద్యార్థులకు మొదటి రోజు నుంచి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేపట్టనున్నారు. అనేక పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మౌలిక వసతుల పనులు ఇంకా పూర్తి కాలేదు.

4,25,119 పాఠ్యపుస్తకాలు అవసరం..

జిల్లాలో 560 ప్రాథమిక, 125 ప్రాథమికోన్నత, 131 ఉన్నత పాఠశాలలు ఉండగా.. 61,656 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి మొత్తం 4,25,119 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా.. ప్రస్తుతం జిల్లాకు 3,78 లక్షల పుస్తకాలు చేరుకున్నాయి. ఈ పుస్తకాలను ఇప్పటికే ఆయా మండలాలకు చేరవేశారు. పాఠశాలల పునఃప్రారంభం నాటి నుంచి విద్యార్థులకు అందజేయనున్నారు. మిగిలిన పుస్తకాలను కూడా త్వరలో జిల్లాకు తెప్పించనుననట్లు అధికారులు చెబుతున్నారు. ఇక విద్యార్థుల యూనిఫాం విషయానికి వస్తే.. జిల్లాకు 61,656 యూనిఫామ్స్‌ కావాల్సి ఉండగా.. ప్రస్తుతం 50,585 యూనిఫామ్స్‌ పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరలో సిద్ధం చేయనున్నారు. విద్యార్థుల యూనిఫాం కుట్టే బాధ్యతను గ్రామాల్లో సెర్ప్‌, అర్బన్‌లో మెప్మాకు అప్పగించిన విషయం తెలిసిందే.



నాగర్‌కర్నూల్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల

కొనసాగుతున్న మరమ్మతులు..



మేడిపూర్‌ పాఠశాలలో సిద్ధమవుతున్న తలుపులు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులకు రూ. 25.18 కోట్లు మంజూరు కాగా.. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పనులు కొనసాగుతున్నాయి. ప్రతి పాఠశాలలో మరుగుదొడ్లు, లైట్లు, తలుపులు, కిటికీలు, మూత్రశాలలు, బోర్డుల ఏర్పాటు, ఇతరత్రా పనులు చేపడుతున్నారు. మొత్తం 550 పాఠశాలలకుగాను 135 బడుల్లో ప్రతిపాదించిన వంద శాతం పనులను పూర్తి చేశారు. మిగిలిన 415 పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈనెలాఖరులోగా పనులను పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం నిర్ణీత సమయానికి పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు.

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు..

పండగ వాతావరణంలో పాఠశాలలను పునఃప్రారంభిస్తున్నాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాకు చేరిన పుస్తకాలను ఇప్పటికే ఆయా మండలాలకు పంపించాం. మిగిలిన పుస్తకాలను కూడా త్వరలోనే తెప్పిస్తాం. ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయి. ఈనెలాఖరులోగా పనులను పూర్తిచేస్తాం.

– గోవిందరాజులు, డీఈఓ

'ప్రైవేటు' భారం..

పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రైవేటు విద్య భారంగా మారుతోంది. ప్రైవేటు సంస్థలు ముద్రించిన పాఠ్యపుస్తకాలు అంతగా నాణ్యత లేకున్నా.. ధరలు మాత్రం విపరీతంగా పెంచేశారు. ఓవైపు పాఠశాల, కళాశాలల ఫీజులు.. మరోవైపు పుస్తకాల ధరల మోతతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలనుకునే వారి ఆశలు అడియాశలుగా మారుతున్నాయి. నోట్‌బుక్స్‌ సెంటర్ల నిర్వాహకులు కొందరు ప్రైవేటు పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 6, 7, 8, 9, 10 తరగతుల ఇంగ్లిష్‌ మీడియం పుస్తకాలను తక్కువ శాతం ప్రింటింగ్‌ చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. డిమాండ్‌ ఉన్న పుస్తకాలను 50 శాతం అధికంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

5 కి.మీ., నడిచి వెళ్లా..

మా నాన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో తాను చదువు చెప్పిన పాఠశాలలోనే మొదటగా చేర్పించారు. నంద్యాల దగ్గరలో ఉన్న వేములపాడు ప్రాథమిక పాఠశాలలో మొదటిసారి చేరాను. ప్రాథమిక విద్యాభ్యాసం అనంతరం ఉన్నత పాఠశాల కోసం మా గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎస్‌ఆర్‌పేట ఉన్నత పాఠశాలలో చేరాను. రోజు పాఠశాలకు నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చేది. అప్పట్లో చదువుకోవాలి అన్న కోరిక ఉన్నా పెద్దగా సౌకర్యాలు ఉండేవి కావు. అప్పట్లో ఉపాధ్యాయులంటే భయం.. గౌరవం ఉండేది. కానీ, ప్రస్తుత పరిస్థితులు విద్యార్థులకు చాలా అనుకూలంగా, సౌకర్యాలు కూడా ఉన్నాయి. నేటి ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలి. – గోవిందరాజులు, డీఈఓ



సమస్యల స్వాగతం

వేసవి సెలవులు ముగిసి.. బుధవారం నుంచి విద్యా సంస్థలు తెరుచుకోనున్నాయి. అయితే చాలా వరకు ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. చాలీచాలని తరగతి గదులు, శిథిల భవనాలు, అరకొరగా సిబ్బంది, వసతుల లేమి వంటి సమస్యలే విద్యార్థులకు స్వాగతం పలకనున్నాయి. కొన్నిచోట్ల అభివృద్ధి పనులు చేపట్టినా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేవు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో సమస్యలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

సాక్షి ఫోకస్‌

– వివరాలు 10లో..



మన్ననూర్‌ ఉన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరిన మూత్రశాలలు

వట్టెం వెంకన్నాలయం ప్రశాంత పుణ్యక్షేత్రం



వట్టెం శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకుని వస్తున్న త్రిపుర గవర్నర్‌ నల్లు ఇంద్రసేనారెడ్డి

త్రిపుర గవర్నర్‌ నల్లు ఇంద్రసేనారెడ్డి

బిజినేపల్లి: నాగర్‌కర్నూల్‌ జిల్లాలోని వట్టెం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం మనస్సుకు ప్రశాంతమైన పుణ్యక్షేత్రమని, ఈ ఆలయాన్ని నిత్యం దర్శించుకుంటే మంచి ఆరోగ్యం వరిస్తుందని త్రిపుర గవర్నర్‌ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఆలయ వ్యవస్థాపకుడు సందడి రంగారెడ్డి కుటుంబంతో తనకు ఆత్మీయ అనుబంధం ఉందన్నారు. మంగళవారం వట్టెం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రదక్షిణలు చేసి గోదాదేవి అలివేలు మంగ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆలయ నిర్మాణం, విశిష్టత, ఆధ్యాత్మిక కార్యక్రమాలు వివరించారు. సందడి రంగారెడ్డి లాంటి వ్యక్తులు ఉన్నత ఉద్యోగం వదిలి ఆధ్యాత్మిక చింతనలో గుడి.. బడిని ఒక దగ్గర ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక వృక్షాన్ని నాటారు. వట్టెం శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఆధ్యాత్మిక భావంతోపాటు మానసిక ప్రశాంతత, ఆహ్లాదం కలుగుతుందని, ఈ వాతావరణంలో సంచరిస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌ అనంత నర్సింహారెడ్డి, వ్యవస్థాపక సభ్యులు సందడి ప్రతాప్‌రెడ్డి, బీజేపీ నాయకులు పి.రాములు, బంగారు శ్రుతి, భూషయ్య, నారాయణచారి, ఆయా పార్టీల నాయకులు తిరుపతిరెడ్డి, పులేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిధులతో విద్యాభివృద్ధి

ఎక్సైజ్‌, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్‌ రూరల్‌: కొల్లాపూర్‌ నియోజకవర్గంలోని పాఠశాలల అభివృద్ధి, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే నిధులను ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తానని ఎక్సైజ్‌, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండలంలోని సింగోటంలో మంగళవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. తనకున్న రూ. 10 కోట్ల నిధులలో రూ. 8 కోట్లు విద్యాభివృద్ధికి ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అన్ని పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి మహిళా సంఘాలు, ఉపాధ్యాయులు చేయూత అందించాలని కోరారు. నియోజకవర్గంలో నాలుగు పాఠశాలలను ఎంపిక చేసుకొని, వాటిని అన్నివిధాలా తీర్చిదిద్దుతానని అన్నారు. సింగోటం పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తానన్నారు. రూ. 40 లక్షలతో విద్యార్థులకు అవసరమైన ఫర్నిచర్‌, ఆట వస్తువులు, మూత్రశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ ఇమిడిశెట్టి వెంకటస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణాలు పూర్తిచేయాలి



పెద్దకొత్తపల్లి పాఠశాలలో తరగతి గదులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ గోపాల్‌నాయక్‌

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అదనపు గదుల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని జెడ్పీ సీఈఓ గోపాల్‌నాయక్‌ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా పనుల పురోగతిపై ఎంపీడీఓ నాగేందర్‌తో ఆరా తీయగా.. సరైన సమాధానం చెప్పకపోవడంతో జెడ్పీ సీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు తరగతి గదుల నిర్మాణాల పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాలకు సర్వశిక్ష అభియాన్‌ ద్వారా తరగతి గదుల నిర్మాణానికి రూ. 60 లక్షల మంజూరు కాగా.. కాంట్రాక్టర్‌ సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో రూ. 3 లక్షలు వెనక్కి వెళ్లాయని తెలిపారు. దీంతో గదుల నిర్మాణం నిలిచిపోయినట్లు పేర్కొన్నారు. బుధవారం జిల్లా పరిషత్‌ కార్యాలయానికి గదుల నిర్మాణ మేస్త్రీని తీసుకురావాలని పాఠశాల హెచ్‌ఎం మద్దిలేటికి సూచించారు. అంతకుముందు పెద్దకొత్తపల్లిలో మిషన్‌ భగీరథ నల్లాల ఏర్పాటును స్పెషల్‌ ఆఫీసర్‌ లక్ష్మణ్‌, పంచాయతీ కార్యదర్శి నాగశేషులతో కలిసి జెడ్పీ సీఈఓ పరిశీలించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్‌ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీఓ లక్ష్మణ్‌ ఉన్నారు.

భాషా పండిట్‌, వ్యాయామ టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన



భాషా పండిట్‌, వ్యాయామ ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

నాగర్‌కర్నూల్‌ క్రైం: భాషా పండిట్‌, వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. ఈసందర్భంగా డీఈఓ గోవిందరాజులు మాట్లాడుతూ.. 154 మంది తెలుగు పండిట్‌, 129 మంది హిందీ పండిట్‌, 62 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, ముగ్గురు ఉర్దూ టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని తెలిపారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న భాషా పండిట్‌, వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసినట్లు చెప్పారు. వెరిఫికేషన్‌ ప్రక్రియలో నోడల్‌ అధికారి కురుమయ్య, ఏసీ రాజశేఖరరావు, సెక్టోరియల్‌ అధికారులు వెంకటయ్య, షర్ఫుద్దీన్‌, నూరుద్దీన్‌, ఎస్జీఎఫ్‌ కార్యదర్శి పాండు, జీహెచ్‌ఎం తిరుపతయ్య ఉన్నారు.

■ స్పెషల్‌ ఎడ్యుకేషన్‌ బీఈడీ అర్హత కలిగి ఉన్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులు స్కూల్‌ అసిస్టెంట్‌ స్పెషలైజేషన్‌ పదోన్నతికి సంబంధించి ఈనెల 12న సర్వీస్‌ రిజిస్టర్‌ ఒరిజినల్‌ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ చేయించుకోవాలని డీఈఓ గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్‌ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందుటకు కావాల్సిన ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను deonagarkurnool.weebly.com వెబ్‌సైట్‌లో ఉంచారని పేర్కొన్నారు.

అవిశ్వాసం నెగ్గేనా..?

- నేడు అచ్చంపేట మున్సిపల్‌ చైర్మన్‌పై 'అవిశ్వాస' పరీక్ష
- చైర్మన్‌ పీఠం దక్కించుకునేందుకు కాంగ్రెస్‌ పార్టీ పావులు
- ఆసక్తి రేపుతున్న రాజకీయాలు

అచ్చంపేట: రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థల్లో అవిశ్వాసాల జోరు పెరిగింది. మున్సిపాలిటీలను సైతం చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్‌ పార్టీ వేగంగా పావులు కదుపుతోంది. అందులో భాగంగా బీఆర్‌ఎస్‌కు చెందిన అచ్చంపేట మున్సిపల్‌ చైర్మన్‌ ఎడ్ల నర్సింహాగౌడ్‌పై ఆ పార్టీ అసమ్మతి కౌన్సిలర్లతో కలిసి కాంగ్రెస్‌ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి తెర లేపారు. ఈమేరకు ఇటీవల కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మాన నోటీసు అందజేశారు. దీంతో బుధవారం ఉదయం 11 గంటలకు బలపరీక్ష నిర్వహించనున్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు దాదాపుగా 20 రోజుల నుంచి కేరళ, గోవా క్యాంపులో ఉన్నట్లు తెలిసింది. మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులు ఉండగా.. బీఆర్‌ఎస్‌ 13, కాంగ్రెస్‌ 6, బీజేపీ తరఫున ఒక కౌన్సిలర్‌ గెలుపొందారు. బీఆర్‌ఎస్‌కు చెందిన 5వ వార్డు కౌన్సిలర్‌ అకుల లావణ్య అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఎమ్మెల్యేగా వంశీకృష్ణ గెలిచిన తర్వాత వైస్‌ చైర్మన్‌ పోరెడ్డి శైలజ కాంగ్రెస్‌ పార్టీలో చేరడంతో వారి బలం 8కి చేరింది. బీఆర్‌ఎస్‌కు సంఖ్యాపరంగా 11 మంది ఉన్నా.. గతనెల 25న బీఆర్‌ఎస్‌కు చెందిన 3, 4, 6, 13, 17 వార్డులకు చెందిన కౌన్సిలర్లు సోమ్లా నాయక్‌, మెహరాజ్‌ బేగం, గడ్డం రమేష్‌, అంతటి శివ, తగురం శ్రీనివాసులు అవిశ్వాస నోటీస్‌పై సంతకాలు చేశారు. దీంతో కాంగ్రెస్‌ బలం 13కు చేరింది. అవిశ్వాసంపై సంతకం చేసిన బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్‌ క్యాంపునకు వెళ్లకుండా వెనుదిరిగి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. అతడు ఎవరి వెంట నడుస్తారనేది తేలాల్సి ఉంది. ఇటీవల మరో ఇద్దరు కౌన్సిలర్లు సుంకరి నిర్మల, గోపిశెట్టి శివ కాంగ్రెస్‌ కండువా కప్పుకొన్నారు. దీంతో 2/3 మెజార్టీకి కావాల్సిన 15 మంది కౌన్సిలర్ల మద్దతు కాంగ్రెస్‌కు లభించింది. అదేవిధంగా 9వ వార్డు బీజేపీ కౌన్సిలర్‌ సుగుణమ్మ కూడా తమకే మద్దతు ఇస్తుందంటే, తమకు మద్దతు ఇస్తుందని కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు, కౌన్సిలర్లు భావిస్తున్నారు. అందరి మద్దతుతో చైర్మన్‌ పదవి దక్కించుకుంటామనే ధీమాతో కాంగ్రెస్‌ నాయకులు ఉన్నారు.

రిటర్నింగ్‌ అధికారిగా ఆర్డీఓ..

మున్సిపల్‌ చైర్మన్‌ ఎడ్ల నర్సింహ్మాగౌడ్‌పై కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. రిటర్నింగ్‌ అధికారిగా అచ్చంపేట ఆర్డీఓ మాధవిని నియమిస్తూ మే 27న కలెక్టర్‌ ఉత్తర్వులు జారీ చేశారు. ఈక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ శ్యాంసుందర్‌తో కలిసి ఏర్పాట్లు చేస్తున్నారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాసంపై ఏర్పాటు చేసే ప్రత్యేక సమావేశంలో కౌన్సిలర్లు చేతులెత్తే విధానంలో తమ మద్దతు ప్రకటించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీలో 20 మంది కౌన్సిలర్లు ఉండగా.. 13 మంది కౌన్సిలర్లు, ఎక్స్‌ అఫీషియో సభ్యులైన ఎమ్మెల్యే వంశీకృష్ణ సంతకాలతో కూడిన అవిశ్వాస నోటీస్‌ అందజేశారు.



అచ్చంపేట మున్సిపల్‌ కార్యాలయం

విప్‌ జారీ చేసిన బీఆర్‌ఎస్‌..

మున్సిపల్‌ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన తరుణంలో బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్లకు పార్టీ విప్‌ జారీ చేసింది. బీఆర్‌ఎస్‌కు చెందిన 11 మంది కౌన్సిలర్లకు మంగళవారం వాటి ప్రతులను అందజేశారు. అచ్చంపేట మున్సిపాలిటీకి రెండేళ్ల పదవీ కాలం ఉడటం చేత రాష్ట్రంలో ఎక్కడ కూడా లేనివిధంగా ఇక్కడ విఫ్‌ జారీ చేశారు. విఫ్‌ జారీ చేసిన పత్రాలను రిటర్నింగ్‌ అధికారి కె.మాధవికి అందజేసినట్లు పార్టీ సీనియర్‌ నాయకులు అమీనుద్దీన్‌, ఖలీల్‌ తెలిపారు. ఈవిషయంపై రిటర్నింగ్‌ అధికారిని వివరణ కోరగా.. అవిశ్వాసానికి 24 గంటల ముందు అందజేయాల్సి ఉంటుందని, తమకు మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు అందజేశారని చెప్పారు.

క్యాంపులో కౌన్సిలర్లు?

మున్సిపల్‌ చైర్మన్‌పై అవిశ్వాస నోటీసులు అందించిన రోజే కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లినట్లు తెలిసింది. 15 రోజులుగా విహార యాత్రలో ఉన్న కౌన్సిలర్లు.. బుధవారం మున్సిపల్‌ కార్యాలయంలో నిర్వహించే ప్రత్యేక సమావేశానికి నేరుగా హాజరుకానున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ప్రైవేటు బ్యాంకు మేనేజర్‌కు కుచ్చుటోపి

- రూ. 1.50 లక్షలు వసూలు చేసిన సైబర్‌ నేరగాళ్లు

వివరాలు 12లో ▸

క్లుప్తంగా

హైవేపై రోడ్డు ప్రమాదం.. వ్యక్తి దుర్మరణం

జడ్చర్ల: కావేరమ్మపేట శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ఓ మోటర్ బైక్‌ను వెనుక నుంచి కంటెయినర్ ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండల పరిధిలోని పోలేపల్లి గ్రామానికి చెందిన కందూరు చెన్నయ్య(50) బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో హమాలీగా పని చేస్తున్నాడు. రోజులాగే పోలేపల్లి నుంచి బాదేపల్లికి వచ్చి పనులు ముగించుకుని బైక్‌పై వెళుతుండగా వెనుక నుంచి ఓ లారీ కంటెయినర్ వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని లారీ కొంత దూరం ఈడ్చుకెళ్లింది. అనంతరం మృతదేహాన్ని పోలీసులు జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారును ఢీకొట్టిన లారీ.. ఐదుగురికి గాయాలు

జడ్చర్ల: కారును వెనుక నుంచి ఓ లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఐదుగురు గాయపడిన సంఘటన మంగళవారం జడ్చర్ల మండల పరిధిలోని చిట్టెంబోయిన్‌పల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా చందుబట్లకి చెందిన నాగరాజుగౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి భూత్పూర్ వైపు వెళుతుండగా చిట్టెంబోయిన్‌పల్లి శివారులో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో కారులో ఉన్న నాగరాజుతో పాటు ఆయన భార్య దివ్యవాణి, అత్త నాగమణి, ఇద్దరు పిల్లలు గాయపడ్డారు. వీరిలో నాగమణికి తీవ్ర గాయాలు కావడంతో జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి.. మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు లారీ డ్రైవర్ గోపిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

పాడి-పంట

అధికారి సలహా: వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్

లూజ్ విత్తనాలతో రైతులు జాగ్రత్త



నాణ్యత ప్రమాణాలు లేని లూజ్ విత్తనాలు

అలంపూర్: వానాకాలం సీజన్ ప్రారంభమవుతోంది. పంట సాగులో కీలక భూమికను పోషించే విత్తనాల కొనుగోళ్లను చేపడుతున్నారు. ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్న యాసంగి సీజన్‌కు కావాల్సిన విత్తనాల కొనుగోళ్లు చేసే రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. దళారులు రైతులకు లూజ్ విత్తనాలు అమ్మి మోసం చేస్తారని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు లూజ్‌కు, కంపెనీ(ప్యాకెట్ల)కి తేడాలు తెలుసుకుంటే మంచిదన్నారు. ఈ విషయంలో అవగాహన ఉంటే పంట సాగు నుంచే ఇలాంటి నష్టాలను నివారించుకోవచ్చని అవగాహన కల్పిస్తున్నారు.

దళారులు అమ్మే లూజ్ విత్తనాలు...

- ఈ విత్తనాలకు ఎటువంటి నాణ్యత ఉండదు.
- విత్తనాల తయారీలో కంపెనీ వారి, ధ్రువీకరణ అధికారుల ప్రమేయం ఉండదు.
- లూజ్ విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో ఎటువంటి బిల్లు ఇవ్వరు.
- ప్రాసెసింగ్, శుద్ధి ఇతర ప్రమాణాలు ఉండవు.
- ఈ విత్తనాలు విత్తినప్పుడు, పంట మధ్య కాలంలో పూత, కాత దశలో ఏమైనా నష్టాలు జరిగితే రైతులకు న్యాయం జరగదు.
- ఈ విత్తనాలకు జన్యు నాణ్యత ఉండదు.
- ఈ విత్తనాలను దళారులు, రైతులను మోసం చేసే వారు మాత్రమే విక్రయిస్తారు.

కంపెనీ ప్యాకింగ్ విత్తనాలు..

- ఈ విత్తనాలకు పూర్తి నాణ్యత ఉంటుంది.
- ఈ విత్తనాల తయారీలో వివిధ దశల్లో కంపెనీ వారు ధ్రువీకరణ అధికారులు పాల్గొంటారు.
- విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా బిల్లు ఇస్తారు.
- విత్తన తయారీలో ప్రాసెసింగ్, శుద్ధి, ఇతర నాణ్యత ప్రామాణాలు తప్పక పాటిస్తారు.
- ఈ విత్తనాలు కొనగోళ్లు చేసిన సమయంలో రైతులకు బిల్లు ఇస్తారు. దీంతో పూర్తి న్యాయం జరుగుతుంది.
- ఈ విత్తనాలకు ఖచ్చితంగా జన్యు నాణ్యత ఉంటుంది.
- వీటికి వ్యవసాయ శాఖ వారిచే లైసెన్స్ పొందిన డీలర్లు విక్రయిస్తారు.

నష్టాలు జరుగకుండా జాగ్రత్తలు..

వానాకాలం పంట సాగు చేసే రైతులు వ్యవసాయ అధికారులతో లైసెన్సులు పొందిన డీలర్ల వద్దనే కొనుగోళ్లు చేసుకోవాలి. కొనుగోళ్లు చేసిన దుకాణాల్లో తప్పక రసీదు తీసుకోవాలి. పంట కాలం పూర్తయ్యే వరకు వాటిని భద్రంగా దాచి ఉంచాలి. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు లూజ్ విత్తనాలు అమ్మడానికి వస్తే కొనుగోళ్లు చేయవద్దు. లూజ్ విత్తనాలు విక్రయించడానికి వస్తే వారి సమాచారాం వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలి. విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటిస్తే పంట సాగుకు ముందే జరిగే కొన్ని నష్టాలను అన్నదాతలు నివారించుకోవచ్చు. అందుకే రైతులు విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి.

సమస్యల స్వాగతం

- ప్రభుత్వ బడుల్లో కనీస సౌకర్యాలు కరువు
- చిన్నపాటి వర్షాలకే జలమయం అవుతున్న పాఠశాలలు
- అనేక చోట్ల అసంపూర్తిగానే అదనపు తరగతి గదుల నిర్మాణం
- గదుల కొరతతో విద్యార్థులకు తప్పని అవస్థలు
- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న వేళ ప్రభుత్వ పాఠశాలలు పలు సమస్యలతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. అసంపూర్తి పనులు.. అసౌకర్యాల మధ్య విద్యార్థులు బడిబాట పట్టాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలోని చాలా పాఠశాలలు చిన్నపాటి వర్షాలకే చెరువులను తలపిస్తున్నాయి. **తరగతి గదులు పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. మరికొన్ని బడుల్లో తరగతి గదులు ఇతర నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. పూర్తి స్థాయిలో ప్రహరీలు, వంట గదులు, భోజనశాలలు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.** కొత్త విద్యా సంవత్సరంలోనూ పాత సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న సర్కారు బడులపై 'సాక్షి' ప్రత్యేక కథనం. – సాక్షి నెట్‌వర్క్

పునాదులకే పరిమితమైన భోజనశాల



వెల్దండ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భోజనశాల

వెల్దండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో చేపట్టిన భోజనశాల పునాదులకే పరిమితమైంది. రెండేళ్ల కిందట చేపట్టిన భోజనశాల నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదు. దీంతో విద్యార్థులు ఆరుబయటే కూర్చొని భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొంది. భైరాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో అదనపు గది నిర్మాణం పూర్తి కాకపోవడంతో రాళ్లు, రప్పల **మధ్య విద్యార్థులు చదువు సాగించాల్సి వస్తోంది.**

అసంపూర్తి పనులతో ఇబ్బందులు..



నారాయణపేట మండలం జలాల్‌పూర్‌లో ప్రమాదకరంగా ఉన్న నీటి సంపు

సాక్షి ఫోకస్

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తి పనులతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. నారాయణపేట ఎమ్మార్సీ పరిధిలో మొత్తం 45 పీఎస్, 14 యూపీఎస్, 8 ఉన్నత పాఠశాలలు ఉండగా.. 9,800 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరమ్మతు పనుల కోసం తీసుకొచ్చిన రాళ్లు, ఇసుక కుప్పలతో పాఠశాల మైదానాలు దర్శనమిస్తున్నాయి. నీటిసంపుల నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రమాదకరంగా మారాయి.

శిథిలమైన తరగతి గదులు



ఉండవెల్లి పాఠశాలలో పెచ్చులూడిన తరగతి గది

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. పాఠశాల నూతన భవనం కలగానే మారింది. భవన నిర్మాణ పనులు పిల్లర్ దశలోనే ఉండటంతో విద్యార్థులు శిథిల గదుల్లోనే చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం గదులకు మరమ్మతులైనా చేయించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

అద్దె భవనంలో అవస్థలు



దామరగిద్ద బాలికల ప్రాథమిక పాఠశాల కొనసాగుతున్న అద్దె భవనం ఇదే

దామరగిద్ద: మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాల అద్దె భవనంలో అసౌకర్యాల మధ్య కొనసాగుతోంది. పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం చేపట్టిన నేపథ్యంలో గత విద్యా సంవత్సరం అద్దె భవనంలోకి పాఠశాలను మార్చారు. కొత్త విద్యా సంవత్సరంలోనైనా కొత్త భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా, కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవతో నూతన భవనం నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి.

చిన్నపాటి వర్షానికే బురదమయం



అలంపూర్ న్యూప్లాట్ జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో నిలిచిన నీళ్లు

అలంపూర్ రూరల్: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ న్యూప్లాట్స్ పాఠశాల ఆవరణ చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. కనీసం విద్యార్థులు పాఠశాలల్లోకి వెళ్లేందుకు, ప్రార్థన చేసేందుకు వీల్లేకుండా నీళ్లు నిలుస్తున్నాయి. మండలంలోని పలు పాఠశాలల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

మౌలిక సదుపాయాలు కరువు..

అమ్రాబాద్: మండలంలోని మొల్కమామిడి ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. మూత్రశాలలు మరుగుదొడ్లకు మరమ్మతు చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. వంటగది నిర్మాణం పూర్తి కాలేదు. వర్షం వస్తే నీరు పాఠశాల ఆవరణలోకి వచ్చి చేరుతోంది.



మొల్కమామిడి ప్రాథమిక పాఠశాల దుస్థితి



ప్రహరీ లేని మన్ననూర్ ఉన్నత పాఠశాల

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

మన్ననూర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పాఠశాల ఆవరణ మీదుగా వ్యవసాయ పొలాలకు రాకపోకలు సాగిస్తున్నారు. పశువులు, పందుల సంచారంతో విద్యార్థుల చదువుకు ఆటంకంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వర్షపు నీరంతా పాఠశాలలోకే..



రామాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపునీరు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని రామాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ చెరువును తలపిస్తోంది. మంగళవారం కురిసిన వర్షానికి వర్షపునీరు భారీగా వచ్చి చేరింది. పాఠశాల ఎదుట ఉన్న వాగుపై కల్వర్టు నిర్మించక పోవడంతో కొంత నీరు వాగులోకి.. మరికొంత నీరు పాఠశాల ఆవరణలోకి వచ్చి చేరుతోంది. అంతేగాక పాఠశాల సమీపంలోని వాగుపై కల్వర్టు నిర్మించకపోవడంతో ప్రమాదకరంగా మారింది. చెరువును తలపిస్తున్న పాఠశాలకు విద్యార్థులను ఎలా పంపాలని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల మైదానంలో వర్షపు నీరు నిలవకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శిథిలాల నడుమ చదువు సాగేదెలా?



రాజోళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న శిథిలాలు

రాజోళి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం కోసం ఇటీవల పాత భవనం తొలగింపు పనులు చేపట్టారు. అక్కడి నుంచి శిథిలాలను పూర్తిగా తరలించకపోవడం.. పాత భవనాన్ని పూర్తిగా తొలగించకపోవడంతో ప్రమాదకరంగా మారింది. శిథిలాల నడుమ విద్యార్థులు చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అదేవిధంగా రెండు అదనపు గదుల నిర్మాణం ముందుకు సాగడంలేదు. విద్యార్థులకు గదుల కొరత తీరడం లేదు.

దుర్వాసన.. దోమల బెడద



ఆత్మకూర్‌లోని ఉర్దూ మీడియం పాఠశాల ఆవరణలో పారుతున్న మురుగు

ఆత్మకూర్: మున్సిపాలిటీలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో మురుగు పారుతుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడదతో విద్యార్థులు సీజనల్ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. పాఠశాల ఆవరణలో వర్షపు నీటితో పాటు మురుగు పారుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఎస్సీ కాలనీలో పాఠశాల భవన నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదు.

విద్యార్థులను వేధిస్తున్న వసతుల లేమి



అయిజ ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణలో నిలిచిన మురుగు

అయిజ: మున్సిపాలిటీ, మండలంలో మొత్తం 55 పాఠశాలలు ఉండగా.. పలు బడుల్లో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకొర నిధులతో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు ముందుకు సాగడం లేదు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోకి వర్షపు నీటితో పాటు మురుగు చేరుతుండటంతో దుర్గంధ భరితంగా మారుతోంది. మురుగునీటి సమస్య పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులను పట్టి పీడిస్తోంది.

ఆదమరిస్తే.. అంతే..



తూక్యానాయక్ ప్రాథమిక పాఠశాలలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

- చంద్రానాయక్ తండాలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఒంటికి, రెంటికి వెళ్లాలంటే పొలం బాట పట్టాల్సిందే. పాఠశాలకు మరుగుదొడ్లు, వంటగది కోసం నిధులు మంజూరైనప్పటికీ.. వాటిని నిర్మించేందుకు స్థలం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అమరచింత: ఈ ఫొటోలో కనిపిస్తున్న పాఠశాల మండలంలోని తూక్యానాయక్ తండాలో ఉంది. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ వైర్లను పాఠశాల దిమ్మెకు ఏర్పాటు చేయడం ప్రమాదకరంగా మారింది. విద్యార్థులు చెయ్యెత్తితే అందేవిధంగా విద్యుత్ వైర్ ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది.

గోల్‌మాల్

నిబంధనలకు తిలోదకాలిస్తూ.. మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు



యాసంగి సీజన్‌లో గద్వాల మండలం జిల్లెల్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి శృతిఓజా, కలెక్టర్ బీఎం సంతోష్ (ఫైల్)

- ఇదివరకే రూ.20 కోట్ల విలువ చేసే ధాన్యం పక్కదారి
- రికవరీ చేయడంలో అధికారులు విఫలం
- తాజాగా యాసంగిలో మళ్లీ కేటాయింపులు
- ఆమ్యామ్యాలకు అలవాటు పడి అనర్హులకు సహకరిస్తున్న కొందరు అధికారులు

గద్వాల రూరల్: పౌరసరఫరాల శాఖ కొందరు అవినీతి అధికారులకు అడ్డాగా మారింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు ధాన్యం కేటాయింపులు చేస్తుండడంతో రూ.కోట్ల విలువైన ధాన్యం పక్కదారిపడుతూ.. అవినీతి పరుల సంచులు నింపుతోంది. గతంలో పౌరసరఫరాల శాఖలో చోటుచేసుకున్న ఓ అవినీతి వ్యవహారంలో ఏకంగా జిల్లా స్థాయి ఉన్నతాధికారి, ఓ పోలీస్ వలయాధికారులపై వేటుపడగా.. పౌరసరఫరాల శాఖలో పనిచేసే ఓ అధికారి, మరో ఇద్దరు సిబ్బందిపై క్రిమినల్ కేసులు సైతం నమోదయ్యాయి. రెండేళ్ల కిందట అనర్హులకు సుమారు రూ.20 కోట్ల ధాన్యం కేటాయింపులు చేయగా.. ఇందులో కూడా అప్పటి పౌరసరఫరాల శాఖలోని ఓ కీలక అధికారిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై కేసు నమోదు చేసిన అధికారులు చేతులు దులిపేసుకున్నారు. ఇదిలా ఉండగా.. తాజాగా యాసంగి సీజన్‌లో ప్రభుత్వం సేకరించిన ధాన్యం కేటాయింపులో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పౌరసరఫరాల శాఖలో కీలకంగా పనిచేస్తున్న ఓ అధికారిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతుండగా.. ఇందుకనుగుణంగా నిబంధనలకు విరుద్ధంగా అనర్హత ఉన్న మిల్లులకు ధాన్యం కేటాయించడం.. ఆరోపణలకు మరింత బలాన్ని చేకూరుస్తుంది.

నిబంధనల మేరకే కేటాయింపులు..

యాసంగి సీజన్‌లో రైతుల వద్ద ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు కేటాయించాం. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా ఏ ఒక్క రైస్‌మిల్లర్‌కి కూడా ధాన్యాన్ని కేటాయించలేదు. అదేవిధంగా నాకు డబ్బులు ఇచ్చారని చెబుతున్న దాంట్లో నిజం లేదు. పూర్తి నిరాధారమైన ఆరోపణలు. గతంలో అక్రమాలు చోటుచేసుకున్న ధాన్యం మిల్లులకు సంబంధించి కేసులు నమోదు చేశారు. త్వరలోనే వారి నుంచి రికవరీ చేస్తాం.

– విమల, పౌరసరఫరాల శాఖ డీఎం

అనర్హులకు కేటాయింపులు..

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ.. వస్తుంది. తాజాగా 2023–24 యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా మొత్తం సుమారు 3వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా.. వనపర్తి, మెదక్ జిల్లాల నుంచి మరో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. గద్వాల, మెదక్, వనపర్తి జిల్లాల నుంచి సేకరించిన 18 వేల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని జిల్లా వ్యాప్తంగా ఏడు రైస్ మిల్లులకు కేటాయించారు. అయితే ఇందులో గతంలో ధాన్యం తీసుకున్న మిల్లర్లు నిర్ణీత గడువులోగా సీఎమ్మార్ బియ్యం ప్రభుత్వానికి ఇవ్వకపోవడంతో చాలా రైస్‌మిల్లులకు ప్రభుత్వం జరిమానా విధించి డీఫాల్టర్లుగా ప్రకటించింది. ఇలా డీఫాల్టర్లుగా ప్రకటించి, జరిమానా విధించగా.. జరిమానా కట్టని కేటీదొడ్డి మండలానికి చెందిన ఓ రైస్‌మిల్లుకు తాజాగా యాసంగిలో ధాన్యాన్ని కేటాయించారు. దీని వెనుకాల పౌరసరఫరాల శాఖలో ఓ కీలక అధికారి పాత్ర ఉన్నట్లు సమాచారం.



రూ.20 కోట్ల ధాన్యం కేసు ఏమైంది..

జిల్లా వ్యాప్తంగా 2021–22 యాసంగి సీజన్‌కు సంబంధించి మొత్తం 19వేల మెట్రిక్ టన్నులకు పైనే ధాన్యం సేకరించారు. ఇలా సేకరించిన ధాన్యాన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న 55 రైస్ మిల్లులకు కేటాయించారు. ఇందులో 50 రైస్ మిల్లులుండగా, 5 బాయిల్డ్ రైస్ మిల్లులున్నాయి. ఇలా కేటాయించిన 19వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి సుమారు రూ.20 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టగా.. దీనిపై సంబంధిత మిల్లులపై కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో పౌరసరఫరాల శాఖలో పనిచేసి ఇటీవల పదవీవిరమణ పొందిన ఓ కీలక అధికారి, కొందరు రైస్ మిల్లర్లతో మిలాఖత్ అయి పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారనే బలమైన ఆరోపణలు ఉన్నాయి. విషయం కాస్త రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించగా.. ఈ అవినీతి వ్యవహారం నుంచి బయటపడేందుకు కొందరు ఉన్నతాధికారులను కూడా అవినీతి భాగస్వాములను చేశారనే బలమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కారణంగానే రైస్‌మిల్లర్లపై కేసులు నమోదైనప్పటికీ, ఇప్పటి వరకు మూడేళ్లు గడచిపోతున్నా.. ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా గతంలో ఓ రైస్ మిల్లు వ్యవహారంలో జిల్లా స్థాయి ఉన్నతాధికారిపై బదిలీ వేటు పడగా.. ఓ పోలీసు వలయ అధికారి, మరో ముగ్గురు పౌరసరఫరాల శాఖ ఉద్యోగులపై క్రిమినల్ కేసులు సైతం నమోదయ్యాయి.

ప్రజా పాలన అందిస్తాం

రాజధాని అమరావతే.. ఆర్థిక రాజధానిగా విశాఖ ● ఎన్డీఏ శాసనసభాపక్ష సమావేశంలో చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజా పాలన సాగిస్తామని, ప్రతి అడుగు ప్రజల కోసమే వేస్తామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తెలిపారు. ప్రజా వేదికలా కూల్చివేతలు, మూడు రాజధానుల పేరుతో ఆటలు తమ ప్రభుత్వంలో ఉండవని స్పష్టం చేశారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో మంగళవారం ఎన్డీయే కూటమి ఎమ్మెల్యేల సమావేశం నిర్వహించారు. ఇందులో ఎన్డీయే శాసనసభాపక్ష నాయకుడిగా చంద్రబాబు ఎన్నికయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో బాధ్యతాయుతమైన పాజిటివ్ ప్రభుత్వం ఉంటుందని, అశాంతికి తావుండదని చెప్పారు. ఈ ఎన్నికల్లో తాము ఓడింది కేవలం 11 సీట్లలో మాత్రమేనని, 93 శాతం స్ట్రైక్ రేట్‌తో 57 శాతం ఓట్లను కూటమి సాధించిందని తెలిపారు. తనను జైల్లో పెట్టినప్పుడు పవన్ కల్యాణ్ ఇచ్చిన మద్దతును ఎప్పుడూ మరిచిపోనన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని గతంలో చెప్పారని, జైల్లో తనను కలిసిన అనంతరం పొత్తు ప్రకటించారని తెలిపారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతామని, మళ్లీ ప్రజల రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రం పూర్తిగా శిథిలమైందని, దెబ్బతినని వర్గమంటూ లేదన్నారు. పాలన ఎలా ఉండకూడదో, గత పాలన ఒక కేస్ స్టడీ అని చెప్పారు. కక్ష తీర్చుకోవాలని ముందుకెళితే సమస్యలు వస్తాయని, అలాగని తప్పు చేసిన వారిని క్షమించి పూర్తిగా వదిలేస్తే మళ్లీ అదే బాట పడతారన్నారు. చట్ట పరంగా శిక్షించడంతో పాటు విధ్వంసం, కక్ష రాజకీయాలు చేయకుండా సరైన దారిన పెట్టాలన్నారు. తనకు అసెంబ్లీలో అవమానం జరిగిందని, దాన్ని భరించలేక మళ్లీ సీఎంగానే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేశానని గుర్తు చేశారు. శాసనసభను గౌరవ సభగా మార్చి ప్రజా సమస్యలు పరిష్కరించే వేదికగా మార్చుకుందామన్నారు.



ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో అభివాదం చేస్తున్న చంద్రబాబు. చిత్రంలో పురందేశ్వరి, పవన్

కక్షపూరిత రాజకీయాలు ఉండవు

రాష్ట్రానికి ఎంత అప్పు ఉందో తెలీదని, ఎక్కడ నుండి తెచ్చారో తెలీదని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని చంద్రబాబు అన్నారు. సాగునీటి వ్యవస్థ నిర్వీర్యం అయిందని, వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో ఉందన్నారు. పదేళ్ల తర్వాత కూడా రాజధాని ఏది అంటే చెప్పుకోలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కక్ష పూరిత రాజకీయాలు కాకుండా నిర్మాణాత్మక రాజయాలు పాటిద్దామని చెప్పారు. పోలవరం డయా ఫ్రం వాల్ కొట్టుకుపోయిందని, మళ్లీ కేంద్రం సహకారంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీళ్లందిస్తామని తెలిపారు.

రాజధానిగా అమరావతి.. ఆర్థిక రాజధానిగా విశాఖ

ఏపీకి రాజధానిగా అమరావతి, ఆర్థిక రాజధానిగా విశాఖ ఉంటుందని బాబు స్పష్టం చేశారు. న్యాయ రాజధాని కర్నూలు అంటూ మోసం చేశారని, రాయలసీమలో వన్ సైడ్‌గా ఎన్నికలు జరిగాయని చెప్పారు. ముఖ్యమంత్రి కూడా మామూలు మనిషేనని, తాను సీఎంగా ఉన్నా, పవన్ కళ్యాణ్ ఏ పదవిలో ఉన్నా సామాన్యుల్లా ప్రజల్లో ఒకరిగానే ఉంటామని తెలిపారు. హోదా సేవ కోసం తప్ప పెత్తనం కోసం కాదన్నారు. తెలుగు జాతి ప్రపంచంలో నంబర్ వన్‌గా ఉండాలనేది తన కల అని అన్నారు.

హామీలన్నీ నెరవేర్చేలా పాలన: పవన్ కల్యాణ్

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఐదు కోట్ల మందికిపైగా ప్రజలు తమపై నమ్మకం పెట్టుకున్నారని, కక్ష సాధింపులు, వ్యక్తిగత దూషణలకు ఇది సమయం కాదన్నారు. అన్నింటా బలంగా నిలబడతామని చెప్పి అధికారంలోకి వచ్చామని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. చంద్రబాబు ఎంతో నలిగిపోయారని, జైల్లో ఆయన్ని చూశానని, మంచి రోజులు వస్తాయని చెప్పానని, వచ్చాయని తెలిపారు. ఆయన అద్భుతమైన పాలన ఇవ్వాలని కోరుకుంటున్నానని చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ.. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ లక్ష్యంతో పని చేయాలని, మూడు పార్టీల కలయిక త్రివేణి సంగమమని తెలిపారు.

ఎన్డీయే సభాపక్ష నేతగా చంద్రబాబు

ఈ సమావేశంలో చంద్రబాబును ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. తొలుత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తమ పార్టీ శాసనసభాపక్ష నేతగా చంద్రబాబును ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు ప్రకటించారు. అనంతరం పవన్ కళ్యాణ్, చంద్రబాబును ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా ప్రతిపాదించగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి బలపరిచారు. సమావేశం తర్వాత అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, పురందేశ్వరిలు రాజ్‌భవన్‌కు వెళ్లి 164 మంది ఎమ్మెల్యేలు చంద్రబాబును ఎన్డీయే పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు తెలిపి ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. తమకు మద్దతు ప్రకటించిన 163 మంది ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్‌కు సమర్పించారు. దాంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని గవర్నర్ అబ్దుల్ నజీర్.. లాంఛనంగా ఆహ్వానించారు.

జనసేన శాసనసభా పక్ష నేతగా పవన్ కల్యాణ్

జనసేనశాసనసభా పక్ష నాయకుడిగా పవన్‌కల్యాణ్ ఎన్నికయ్యారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పవన్‌కల్యాణ్ అధ్యక్షతన ఆ పార్టీ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. జనసేన తరఫున గెలుపొందిన 21మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సమావేశంలో తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ జనసేన పార్టీ శాసనసభా పక్ష నాయకుడిగా పవన్‌కల్యాణ్ పేరును ప్రతిపాదించగా, మిగిలిన ఎమ్మెల్యేలు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

నేడు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం

- హాజరుకానున్న ప్రధాని మోదీ, షా
- అతిథులుగా రజనీకాంత్, చిరంజీవి

సాక్షి, అమరావతి/గన్నవరం: ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బుధవారం సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర సీఎంగా రెండుసార్లు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో ఆయన మూడోసారి ముఖ్యమంత్రి పీఠం ఎక్కారు. ఇప్పుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బుధవారం ఉదయం 11.27 గంటలకు ఆయన ప్రమాణ స్వీకారం చేసేందుకు గన్నవరం ఐటీ పార్కు వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయనతోపాటు ఉప ముఖ్యమంత్రిగా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేయడం దాదాపు ఖరారైంది. మరికొందరు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకారం తర్వాత తొలి సంతకం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై చేసే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాగే ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుకు సంబంధించిన అంశంపైనా ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

హాజరుకానున్న ప్రధాని, ప్రముఖులు

ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు, రాజకీయ ప్రముఖులు హాజరవుతున్నారు. అమిత్‌షా, నడ్డా ఇప్పటికే విజయవాడ చేరుకున్నారు. సినీ ప్రముఖులను తన ప్రమాణ స్వీకారానికి చంద్రబాబు అతిథులుగా ఆహ్వానించగా చిరంజీవి కుటుంబంతో సహా ఇప్పటికే విజయవాడ వచ్చారు.



వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆ పార్టీ ముఖ్య నాయకులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కలిశారు. మంగళవారం తాడేపల్లిలోని జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయనతో భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఎంపీ మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, వరుదు కల్యాణి, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, కొట్టు సత్యనారాయణ, నాయకులు గంగుల ప్రభాకర్ రెడ్డి, మజ్జి శ్రీనివాసరావు, కేకే రాజు, జక్కంపూడి రాజా, రాపాక వరప్రసాద్, ఇంతియాజ్ తదితరులు ఉన్నారు.

ఊరూరా విధ్వంసాలు, వేధింపులు

- వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యం
- చంద్రబాబు, లోకేశ్‌ల అండతో రెచ్చిపోతున్న టీడీపీ శ్రేణులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ నేతలు, కార్యకర్తల ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది. వారం రోజులుగా జరిగిన వందలాది ఘటనల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తీవ్ర గాయాలపాలయ్యారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లింది. ప్రధానంగా గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టిస్తున్నారు. శిలాఫలకాలను ధ్వంసం చేస్తూ.. వైఎస్సార్ విగ్రహాలను కూలదోస్తున్నారు. పోలింగ్ ముగిసినప్పటి నుంచి దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు మొదలైనప్పటికీ.. ఫలితాల వెల్లడి తర్వాత పరిస్థితి శ్రుతిమించిపోయింది. ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను దారి కాచి దాడులు చేస్తున్నారు. గ్రామాల్లో ఇళ్లలోకి దూరి కొడుతున్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్న అనుమానంతో సామాన్యులను సైతం కక్ష సాధింపుతో వేధిస్తున్నారు. 'ఇదేం అన్యాయం.. కాపాడండయ్యా..'అంటూ బాధితులు పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీస్తున్నా.. ఆ ఖాకీలు మాత్రం వృత్తి ధర్మాన్ని మరచి చోద్యం చూస్తున్నారు. తాజాగా అనంతపురంలో హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను చంపుతామని బెదిరించారు. ఊరు వదిలి వెళ్లాలని సాక్షాత్తు పోలీసు అధికారులే ఉచిత సలహా ఇస్తుండటం నివ్వెరపరుస్తోంది. తెనాలిలో వైఎస్సార్‌సీపీ నేత కాశిదాసు సత్యంపై, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం బట్లూరులో ఆర్‌ఎంపీ వైద్యుడు శివయ్యపై హత్యాయత్నం చేశారు. పరిస్థితి చూస్తుంటే మనం ప్రజాస్వామ్య దేశంలోనే ఉన్నామా.. అనే అనుమానం కలుగుతోంది. రోజు రోజుకూ పెరుగుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తల అరాచకం.. దౌర్జన్యం.. కనుసైగ చేసి దాడులను ప్రోత్సహిస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, లోకేశ్‌ల తీరుపై రాష్ట్రపతికి నివేదించాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్టీ ఎంపీల బృందం మంగళవారం రాత్రి ఢిల్లీ చేరుకుంది. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరింది. రాష్ట్రంలో విధ్వంసకాండ గురించి బుధవారం జాతీయ మీడియాకు కూడా వివరించనుంది. మరోవైపు ఇదే విషయమై సుప్రీంకోర్టును ఆశ్రయించగా, హైకోర్టుకు వెళ్లాలని సూచించింది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జగన్ ఓటమిని జీర్ణించుకోలేక.. కుటుంబ సమేతంగా ఆత్మహత్యాయత్నం

- వీడియో సందేశంతో గుర్తించిన పోలీసులు, కుటుంబ సభ్యులు
- అందరూ ఓట్లు వేశామని చెబుతున్నా ఓటమికి కారణం ఏమిటని ప్రశ్న
- ఈవీఎంలతో మోసం చేశారని ఆరోపణ
- బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే మళ్లీ జగనే సీఎం అని ధీమా



మీడియా ఎదుట ఆవేదన వ్యక్తంచేస్తున్న రాజు, నాగలక్ష్మి దంపతులు

కొవ్వూరు: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓడిపోవడాన్ని ఆ వీరాభిమాని జీర్ణించుకోలేకపోయాడు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా గోదావరి నదిపై ఉన్న గామన్ బ్రిడ్జిపై మంగళవారం ఉదయం చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలు ఏమిటంటే.. తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన తాళ్లూరి రాజు, తన భార్య నాగలక్ష్మి, కుమార్తె హర్షిత, కుమారుడు మోక్షిత్‌తో కలిసి మంగళవారం గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. కొవ్వూరు–కాతేరు మధ్య గోదావరిపై ఉన్న గామన్ బ్రిడ్జి పైకి వేకువజామునే చేరుకున్నాడు. తాను, తన కుటుంబమంతా గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నామని మిత్రులకు వీడియో సందేశం పెట్టాడు. పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, రాజు కుటుంబ సభ్యులు, కొవ్వూరు పట్టణ పోలీసులు ఈ సమాచారం తెలుసుకుని వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బ్రిడ్జిపై రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై ఉన్న రాజుకు, ఆయన కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి బయటకు తీసుకుకొచ్చారు.

ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి ఉంటారు..

అనంతరం.. రాజు మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ ఒక్కరిని అడిగినా వైఎస్సార్‌సీపీకే ఓటు వేశామంటున్నారని, కానీ, జగన్ ఎలా ఓటమి పాలయ్యారో తెలీడంలేదని ఆవేదన వ్యక్తంచేశాడు. తన కుటుంబ చావుతోనైనా ఎన్నికల్లో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ చేస్తారని ఆశిస్తున్నానన్నాడు. ఈవీఎంల ట్యాంపరింగ్ చేసి ఉంటారని, బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని రాజు చెప్పాడు. తన ఆవేదనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టికి తీసుకువెళ్తే రీపోలింగ్‌కు ఆదేశిస్తారన్న ఉద్దేశంతో వీడియో ద్వారా తన సందేశాన్ని తెలిపి కుటుంబ సమేతంగా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నానన్నాడు. అందరికీ మంచి చేసిన జగన్ ఘోరంగా ఓటమి పాలవుతారని కలలో కూడా ఊహించలేదని కన్నీటితో చెప్పాడు. బుధవారం చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తే ఎన్నికలపై విచారణకు అవకాశం ఉండదని.. అందుకనే తెల్లవారుజామున 5.30 గంటలకు భార్యాపిల్లల్ని తీసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు బ్రిడ్జిపైకి వచ్చానని చెప్పాడు. రాజుకు, ఆయన భార్యకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

'అవినీతిని అరికట్టి.. పథకాలు అమలు చేయాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అవినీతిని అరికట్టి అసలైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని ప్రగతిశీల సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్ అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. సీనియర్ సిటిజన్లకు పింఛన్ల మంజూరు, విద్య, వైద్య రంగంలోని వివిధ పథకాలలో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ విషయమై గతంలోనే హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. అర్హులైన లబ్ధిదారులకు అన్ని పథకాలు అమలు చేయకుంటే పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపడతామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అహ్మద్‌ఖాన్, కో–ఆర్డినేటర్ అనిల్‌కుమార్, నాయకులు ఫయాజ్ అహ్మద్, మహేశ్ ముత్తు, శివశంకర్, రుద్రప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

జూరాలకు 7,211 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు మంగళవారం 7,211 క్యూసెక్కులకు వస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానికంగా వర్షం ఆధారంగా ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో వస్తున్నట్లు చెప్పారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 5.547 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి 139 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రామన్‌పాడులో 1,013 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం నాటికి పూర్తి నీటి మట్టం 1,013 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

బాలింత మృతిపై విచారణ

గద్వాల క్రైం: రెండురోజుల క్రితం చికిత్స పొందుతూ బాలింత మృతి చెందిన ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శశికళ, సిద్దప్ప విచారణ చేపట్టారు. మంగళవారం ఆస్పత్రిని సందర్శించి అక్కడి వైద్యులను వివరాలు అడిగారు. కాగా.. కుర్వపల్లికి చెందిన శివలీలా ఈ నెల 5న ప్రసవం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. కాగా అక్కడ శస్త్రచికిత్స చేసి బిడ్డను బయటకు తీశారు. ఈ క్రమంలో బాలింత పరిస్థితి విషమించింది. దీంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కాగా చికిత్స పొందుతూ బాలింత ఈ నెల 9న మృతిచెందింది. ఈ క్రమంలోనే మృతికి గల కారణాలు, వైద్యులు అందించిన మందులు, ల్యాబ్ పరీక్షలు, ఆమె ఆరోగ్య నివేదికలను అధికారులు మంగళవారం పరిశీలించారు. ప్రసవ సమయంలో గర్భిణికి వైద్య సేవలు అందించిన సిబ్బంది వివరాలు, శస్త్ర చికిత్స కోసం తీసుకున్న చర్యలపై వైద్య సిబ్బందితో వివరాలు సేకరించారు. గర్భిణికి అత్యవసర వైద్యం అందించే పరిస్థితిలకు గల కారణాలపై విచారణ చేపట్టారు.



విచారణ చేపట్టిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

అనంతరం జిల్లా ఇంచార్జ్ వైద్యాధికారిణి శశికళ మాట్లాడారు. బాలింత మృతిపై ఉన్నతధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. వైద్యం అందించిన సిబ్బందిని పలు అంశాలపై ఆరా తీశామన్నారు. త్వరలో పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు.

సూరజ్ క్లినిక్‌కు నోటీసులు జారీ..

పట్టణంలోని చింతలపేట సూరజ్ క్లినిక్‌ను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుర్తింపు పొందని వ్యక్తులు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారని నిర్ధారించారు. దీంతో సదరు క్లినిక్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు.

గొర్రెల కాపరికి విద్యుదాఘాతం

- వేలాడుతున్న వైర్లకు తగలడంతో ఘటన
- పరిస్థితి విషమం
- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణం!



గాయపడ్డ బాల్‌రాజు

గండీడ్/మహమ్మదాబాద్: వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన ఉమ్మడి మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దేశాయిపల్లికి చెందిన బాల్‌రాజ్ గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. రోజువారిలో భాగంగానే ఉదయం 11 గంటల ప్రాంతంలో గొర్రెలు మేపడానికి వెళ్లాడు. నక్కల వెంకటయ్య పొలంలో కిందికి వేలాడుతున్న విద్యుత్‌వైర్లను గమనించకుండా మందను ముందుకు పంపాడు ఈక్రమంలో వైర్లు ఆయన గొంతుకు తగలడంతో షాక్‌తో కిందపడిపోయాడు. దీంతో పక్క పొలంలో పనిచేస్తున్న లక్ష్మి, చెన్నమ్మ గమనించి అక్కడికి వెళ్లి చూశారు. విషయాన్ని బాల్‌రాజ్ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారు 108లో అతడిని మహబూబ్‌నగర్ ఎస్వీఎస్‌కు తరలించారు. కాగా గొంతుకు తీవ్రగాయం కావడంతో అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఇదిలా ఉంటే.. కొన్ని రోజులుగా వైర్లు కిందికి వేలాడి ఉన్నాయని వాటిని సరిచేయాలని సంబంధిత అధికారులను పలుమార్లు కోరినా పట్టించుకోలేదని రైతులు తెలిపారు. ఇటీవల గాలివానతో మరింత కిందికి వేలాడడంతో ప్రమాదం జరిగిందని అంటున్నారు. ముందే సరిచేసి ఉంటే పరిస్థితి వచ్చేది కాదని వాపోయారు. ఏఈ సత్యంను వివరణ కోరగా తాను వచ్చిన తర్వాత ఎవరు కూడా ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకురాలేదన్నారు. సమస్య ఉన్నట్లు తనకు చెప్పి ఉంటే తక్షణమే సరిచేసే వారమని పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే విషయం తన దృష్టికి రావడంతో సిబ్బంది పంపించి వైర్లు సరిచేశామన్నారు.

గుండెపోటుతో ఉపాధికూలీ మృతి

మదనాపురం: వనపర్తి జిల్లా మదనాపురం మండలపరిధిలోని నర్సింగాపురంలో మంగళవారం గుండెపోటుతో ఉపాధికూలీ మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కావలి చెన్నన్న (64) ఉదయాన్నే ఉపాధి హామీ పథకంలో భాగంగా.. గడ్డమీద నాగేష్ పొలంలో చదును చేసేందుకు తోటి కూలీలతో కలిసివెళ్లాడు. పనిచేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి అక్కడికక్కడే కుప్పకులాడు. గమనించిన తోటి కూలీలు వెంటనే మేటి నరసింహ గౌడ్ తెలుపగా.. 108కి సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడికి చేరుకొని పరిశీలించారు. కాగా అప్పటికే చెన్నన్న మృతి చెందినట్లు ధ్రువీకరించారు. తహసీల్దార్ అబ్రహం లింకన్, ఏపీవో బాలయ్య, టీఏ జ్యోతి మృతదేహాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన కవి, రచయిత ఎంఎస్.విజయ్‌కుమార్ సంపాదకీయంలో తీసుకొచ్చిన హిందీలో ప్రసిద్ధ రచయిత 'జయశంకర ప్రసాద్ కీ యాద్గార్ కహానియా' పుస్తకాన్ని మంగళవారం స్థానిక డైట్ కళాశాలలో జిల్లా విద్యాధికారి రవీందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాలని కోరారు. కవి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆధునిక హిందీ కవి జయశంకర్‌ప్రసాద్ రచించిన సామాన్య వ్యక్తికి సంబంధించిన యాదార్థ కథలు, నీతి కథలను సేకరించి పుస్తకంగా తీసుకొచ్చినట్లు తెలిపారు. నేటి విద్యార్థులు ఈ కథలను చదవడం వల్ల స్ఫూర్తి పొందవచ్చని తెలిపారు. హిందీ సాహిత్యం పట్ల అభిరుచిని పెంపొందించే విధంగా ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ భాస్కరయ్య, ఏఎంఓ దుంకుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బ్యాంక్ మేనేజర్‌కు కుచ్చుటోపి

- రూ.1.50లక్షలు వసూలు చేసిన సైబర్ నేరగాళ్లు



నాగర్‌కర్నూల్ క్రైం: లోన్‌కోసం దరఖాస్తు చేసుకున్న ప్రైవేట్ బ్యాంక్ మేనేజర్ తన మెయిల్‌కు వచ్చిన లింక్ ఓపెన్ చేసి సైబర్‌నేరగాళ్ల బారిన పడి మోసపోయిన సంఘటన చోటుచేసుకోగా.. మంగళవారం వెలుగులోకి వచ్చింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన ఓ ప్రైవేటు బ్యాంక్ మేనేజర్ పర్సనల్ లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అతని మెయిల్‌కు సాంక్షన్ లెటర్ పేరిట ఓ లింక్ వచ్చింది. ఆ లింక్‌ను ఓపెన్ చేసే క్రమంలో ఫోన్ నంబర్‌ను నమోదు చేశాడు. సైబర్‌నేరగాళ్లు ఫోన్ నంబర్‌కు ఉన్న డీపీని డౌన్‌లోడ్ చేసుకుని న్యూడ్ ఫొటోగా మార్చి ప్రైవేటు బ్యాంక్ మేనేజర్‌ను బెదిరింపులకు పాల్పడ్డారు. ప్రైవేటు బ్యాంక్ మేనేజర్ సైబర్‌నేరగాళ్లకు రూ.1.50లక్షల వరకు నగదు చెల్లించాడు. మరోమారు డబ్బులు అడిగితే ఇవ్వకపోవడంతో ప్రైవేట్ బ్యాంక్ మేనేజర్ కాంటాక్ట్‌లోని 300 మందికి న్యూడ్ ఫొటోలను పంపుతామని బెదిరించారు. దీంతో మోసపోయినట్లు గుర్తించి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా.. విచారణ చేస్తున్నట్లు తెలియజేశారు.

ఏఎస్‌ఐనని చెప్పి బంకు యజమానికి టోకరా

- రూ. 80వేలు కాజేసిన సైబర్ నేరగాడు

ధరూరు: మండల కేంద్రంలోని ఓ బంకు యజమాని గోపి ఫోన్ కాల్‌ను నమ్మి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జాంపల్లికి చెందిన బంకు యజమాని గోపికి ఈ నెల 6న సాయంత్రం ఓ ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి ధరూరు ఏఎస్‌ఐని అని.. తమ ఎస్‌ఐ కుమార్తె ఆరోగ్యం బాగోలేదని గోపీకి తెలిపాడు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉందని వివరించాడు. తాను క్యాష్ ఇస్తానని, తనకు రూ. 80వేలు గూగుల్ పే చేయాలని గోపిని కోరాడు. కాగా గోపి తాను బంకులో లేనని.. తమ మేనేజర్‌కు ఫోన్ చేయాలని చెప్పాడు. దీంతో సదరు మోసగాడు మేనేజర్‌కు కాల్ చేసి రూ. 80వేలు గూగుల్ పే వేయించుకున్నాడు. కాగా డబ్బుల విషయమై పోలీసులను అడుగగా.. తామేమి అలాంటి కాల్ చేయలేదని చెప్పడంతో తాము సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయమని బంకు నిర్వాహకులు గ్రహించారు. మంగళవారం ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

త్వరలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

- జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి జి.శరత్‌చంద్ర

స్టేషన్ మహబూబ్‌నగర్: త్వరలో జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో రాజేంద్రప్రసాద్ స్మారక రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లాల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహణకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర అన్నారు. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మంగళవారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అథ్లెటిక్స్ క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పలువురు సభ్యులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షులు టోని మార్టిన్, ఉపాధ్యక్షులు జె.నర్సింహ, సంయుక్త కార్యదర్శులు సాధిక్‌అలీ, రమేష్‌బాబు, మేరి పుష్ప, కోశాధికారి ఆనంద్, కార్యనిర్వహణ కార్యదర్శులు సి.శ్రీనివాస్, పి.శ్రీనివాసులు, నర్సింలు, సీనియర్ అథ్లెట్ జావిద్, పీఈటీలు దత్తాత్రేయ, రాజు, శ్రీనివాసులు, కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర

ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో మొసలి



కృష్ణాలోని పోస్టాఫీస్ ఆవరణలో మొసలి

కృష్ణా: మండల కేంద్రంలోని పోస్టాఫీస్ ఆవరణలో మంగళవారం మొసలి కనిపించడంతో ఆ ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నవీద్ తన సిబ్బందితో వెళ్లి దానికి వల వేసి బంధించిన తరువాత కృష్ణానదిలోకి వదిలేశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కృష్ణానది పక్కనే ఉండటంతో విష జంతువులు ఇలా జన ఆవాసాల్లోకి రావడం సర్వసాధారణంగా మారిందని గ్రామస్తులు తెలియజేశారు.